క్లుప్తంగా

సంగుపాలెం, కోడూరుకు 24 గంటల విద్యుత్తు



పిట్టలవానిపాలెం: మండలంలోని సంగుపాలెం, కోడూరు గ్రామస్తుల విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. ఇటీవల చందోలు గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సంగుపాలెం, కోడూరు గ్రామాలకు 24 గంటలు విద్యుత్ సరఫరాను విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు



పిట్టలవానిపాలెం: ఈ నెల 8న పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నిక నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. సోమవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీకి అర్హత కలిగిన ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటలకు కమిటీ సభ్యుల ఎన్నిక, 1.30 గంటలకు చైర్మన్, ఉప చైర్మన్‌ల ఎన్నిక జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నోటిఫికేషన్‌ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విడుదల చేశారు.

బోధన బాగుంది..



పిట్టలవానిపాలెం: ఆట పాటలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ పాఠశాలల లక్ష్యం. పిట్టువారిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బుద్దా నాగాంజయేయులు పిల్లలకు ఈ విధంగానే అక్షర జ్ఞానం ఇస్తున్నారు. శనివారం 1, 2 తరగతుల విద్యార్థులకు పలు రకాల జంతువుల మాస్కులు అందజేసి, వాటి స్వభావం, లక్షణాలు, అరుపులను వివరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



చుండూరు(వేమూరు): పేద విద్యార్థులకు తన్నీరు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో నోట్ పుస్తకాలు అందజేయడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు చేబ్రోలు బోడయ్య అన్నారు. చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు శనివారం పంపిణీ చేశారు. ఆలపాడు గ్రామంలో పాఠశాలలకు తన్నీరు ఛారిటబుల్ ట్రస్ట్ ఎన్నో సేవలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంల ప్రముఖ న్యాయవాది పొన్నం విజయకుమార్, ఈ ఎల్ వి అప్పారావు, కె రాజు ఇమ్మానియేలు, ఇందిర , తన్నీరు చంద్ర శేఖర్ తదితురులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో శేషగిరిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షత వహిస్తారని, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్



రేపల్లెరూరల్: మెగా లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి, కక్షిదారులకు న్యాయం చేకూరేలా న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పని చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులకు శనివారం స్థానిక కోర్టు హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నదీ తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి



లంక గ్రామాల ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

కొల్లూరు: కృష్ణా నదికి వరదలు సంభవించే అవకాశాలున్న నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. అధికారుల సూచనలను పాటించాలని కొల్లూరు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మండలంలోని కృష్ణా నదీ తీర గ్రామాలైన పెసర్లంక, పెదలంక, చింతర్లంక, ఈపూరులంక, సుగ్గునలంక, చిలుమూరు లంకల్లో పర్యటించిన ఆయన ప్రజలకు నదికి వరదలొచ్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు భారీగా వరద నీరు విడుదల చేస్తుండటంతో నదికి వరద నీరు విడుదలయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రజలకు వివరించారు. నదిలో నీరున్న సమయంలో పిల్లలు నది చెంతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, పెద్దలు, పశు పోషకులు నదిలో దిగరాదన్నారు. వరద తీవ్రత అధికంగా ఉన్న పక్షంలో అధికారులు ముందస్తుగా గ్రామాల్లో ప్రజలను ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు తరలిస్తారని తెలిపారు. ఆ సమయంలో తమకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ నిరంజన్, ఏస్ఐ అర్జున్, ఆర్ఐ త్రివేణి, ఈఓపీఆర్‌డీ రవిబాబు పాల్గొన్నారు.

తల్లి పాలలో రోగ నిరోధక శక్తి అధికం



తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్న వైద్య సిబ్బంది..



పెసర్లంకలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కొల్లూరు: తల్లిపాలల్లో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు సంధ్య అన్నారు. శనివారం కొల్లూరు బైపాస్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు, పెద్దలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలను అందించాలని, ప్రతి రోజు పాలివ్వడంతో చిన్నారులు అనారోగ్యానికి గురికాకుండా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త సత్యవతి, ఏఎన్ఎం సంధ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

పెసర్లంక (కొల్లూరు) : గర్భిణులు, బాలింతలు తల్లిపాల ప్రాముఖ్యత అవగాహన పెంచుకుని, తమ బిడ్డలకు అందజేయాలని ఐసీడీఎస్ అనంతవరం సెక్టార్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ నగరాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని పెసర్లంకలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహిళలకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కాశి, బాల పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం

వేమూరు: తల్లి ముర్రు పాలు బిడ్డకు అమృతంతో సమానమని అమర్తలూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలోని బాలింతలకు అవగాహన కల్పించారు. ఏసీడీపీఓ విజయ రాణి, అంగన్ వాడీ సూపర్ వైజర్లు కె.మాధవి, బి.శాంతి శ్రీ, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచూరులో..

రాచూరు(భట్టిప్రోలు): తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని రాచూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పల్లెకోన సెక్టార్ సూపర్ వెజర్ ఫజురున్నీస్సా తల్లి పాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, ధనలక్ష్మి, ఏఎన్ఎం విజయ, ఆశ కార్యకర్త ఎ.కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

బాలల స్నేహ సమాజాన్ని నిర్మిద్దాం



వేమూరు: బాలల స్నేహ సమాజాన్ని నిర్మించుకోవడానికి ప్రతి వ్యక్తి కృషి చేయాలి తహసీల్దారు సుశీల పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫాండేషన్ అధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలల స్నేహ సమాజం నిర్మించడం కోసం ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల వడంబడికిలో ఉన్న హక్కులన్నీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి రావు, సీడీపీఓ విజయలక్ష్మి, విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ శేఖర్, ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పాక్షిక ఉప సంహరణకు ఆదేశాలు

భట్టిప్రోలు: సీపీఎస్ ఉద్యోగులు తమ ఖాతాల్లో దాచుకున్న నగదు 25 శాతం పాక్షిక ఉప సంహరణ చేసుకోవడానికి కీలకమైన ఆదేశాలను రాష్ట్ర ఖజాన సంచాలకులు విడుదల చేయడం జరిగిందని బాపట్ల జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీ మోహన్ శనివారం తెలిపారు. మూడు దశలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రతి సీపీఎస్ ఉద్యోగి పాక్షిక ఉప సంహరణ చేసుకోవడానికి అర్హుడన్నారు. ఒకసారి ఈ విధంగా చేసిన అనంతరం మళ్లీ ఐదేళ్లకు చేసుకునే వీలుందన్నారు. సార్లు మాత్రమే ఉద్యోగి పాక్షిక ఉప సంహరణ చేసుకునే అవకాశం ఉందని వివరించారు.

విరాళాల సేకరణ



భట్టిప్రోలు: కేరళలోని వయానాడ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితుల సహాయార్థం సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలులో విరాళాల సేకరణ చేపట్టారు. యూనియన్ నాయకుడు మురుగుడు సత్యన్నారాయణ మాట్లాడుతూ కేరళలో సంభవించిన ఘటన నేపథ్యంలో కొండ చర్యలు విరిగి పడి, వందలాది మంది అశువులు బాసారన్నారు. మానవతా దృక్పథంతో అక్కడి ప్రజలను ఆదుకునేందుకు మనవంతు సహాయ సహకారాలు అందించేందుకు విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. సీఐటీయూ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈవో పీఆర్డీ మల్లికార్జునరావు అన్నారు. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. వారంలో ఒక రోజు ప్రతి కుటుంబ డ్రైడేని పాటించాలని స్థానికులకు వివరించారు. ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు.

నేషనల్ రూరల్ గేమ్స్‌లో బాపట్ల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాస రావు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో వరల్డ్ రూరల్ గేమ్స్ ఫెడరేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 14, అండర్ 19 విభాగాల్లో విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించారు. చాంపియన్ షిప్ సాధించిన కె. కేశవ విష్ణుసాయి, యు.ధర్మ నాగ సత్యనారాయణ, వైభవ్ సాయి రాఘవేంద్ర, సాయితో పాటు కళాశాలకు చెందిన భువనేశ్వర్, ధాత్రి వెంకట్, అభిరామ్‌ను శనివారం కళాశాల ఆవరణంలో ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల సెక్రటరీ మానం నాగేశ్వరరావు, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మప్రసాద్, పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రాఘురామ్, పీఈటీలు అన్వర్ బాషా, వెంకటరాజు పాల్గొన్నారు.

అవగాహన సదస్సుల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం

తెనాలిరూరల్: తెనాలి శాసనసభ్యుడు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గ పర్యటనల్లో నివేశన స్థలాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రజల నుంచి పలు విన్నపాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నివేశన స్థలాల మంజూరు, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెదరావూరు. సిరిపురం, దావులూరు లేఅవుట్లలో అవగాహన సదస్సులు ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు పెదరావూరు లేఅవుట్‌లో, మధ్యాహ్నం 3 గంటలకు సిరిపురం లేఅవుట్‌లో, సాయంత్రం 5 గంటలకు కొల్లిపర మండలం దావులూరు లేఅవుట్‌లో సదస్సులు జరుగుతాయి. మంత్రి మనోహర్ సదస్సుల్లో పాల్గొని స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. ఈ సదస్సుల ఏర్పాట్లను మంత్రి ఓఎస్‌డీ ఎస్.ఏసురత్నం శనివారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏ విధంగా ఏర్పాట్లు చేయాలన్నది అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. పట్టణ పరిధిలోని లబ్ధిదారులు పెదరావూరు, సిరిపురం లేఅవుట్‌లలో, కొల్లిపర మండలంలోని లబ్ధిదారులు దావులూరు లేఅవుట్‌లో జరిగే సదస్సులకు రావాలని ఆయన సూచించారు. గృహనిర్మాణ, పురపాలక సంఘ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఓఎస్‌డీ వెంట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, గృహనిర్మాణ శాఖ ఈఈ యడ్ల భాస్కరరావు, డీఈఈ రఫీవుల్లా ఖాన్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైస్ మిల్లులో రేషన్ బియ్యం స్వాధీనం



రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో సీఎస్ డీటీ పద్మజ

ప్రత్తిపాడు: రైస్ మిల్లులో రంగు రంగుల బస్తాల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని శ్రీ వల్లి రైస్ మిల్లులో నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ్‌కు అందింది. దీంతో జేసీ ఆదేశాల మేరకు శనివారం ప్రత్తిపాడు సివిల్ సప్లయిస్ డీటీ పద్మజ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. తాజ్‌మహల్ పేరుతో రంగుల గోతాల్లో బియ్యం నింపి ఉండటాన్ని గమనించారు. ప్యాకెట్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యమేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మొత్తం 541 బ్యాగుల్లో ఉన్న 22,290 కేజీల రేషన్ బియ్యంతో పాటు, 96 బ్యాగుల్లో ఉన్న 4,490 కేజీల నూకలను స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లు నిర్వాహకులపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు వట్టిచెరుకూరు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని తెనాలిలోని బఫర్ గోడౌన్‌కు తరలించినట్లు చెప్పారు.

ఏసీ బాక్స్ చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ కార్యాలయం బయట ఉన్న ఏసీ బాక్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్డీవో కార్యాలయం సమీపంలో గల ఎన్టీఆర్ విద్యా సేవ కార్యాలయం కిటికీ వెనుక ఉండే అవుట్‌డోర్ యూనిట్‌ను శుక్రవారం రాత్రి చోరీ చేశారు. ఘటనపై అధికారి విజయప్రకాష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు మోటార్ కేబుళ్ల చోరీ



కొత్తరెడ్డిపాలెంలో దొంగలు కత్తిరించిన కేబుల్ వైర్లు

చేబ్రోలు: మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని మెట్ట భూముల్లో సాగునీటి మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. కొత్తరెడ్డిపాలెం, గుండవరం గ్రామాల పరిధిలో 30 మంది రైతులకు చెందిన రాగితీగలతో కూడిన వైర్లను చోరీ చేశారు. ఈ సొత్తు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. మెట్ట భూములకు గత ప్రభుత్వం జలసిరి పథకం కింద బోర్లు వేయించింది. మోటార్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా చేసే కేబుల్స్‌లోని రాగి తీగ కోసం ఆటోలు వచ్చిన దొంగలు వాటిని ఎత్తుకెళ్లారు. ఇప్పటికే పలుమార్లు ఈ తరహా ఘటనలు జరిగాయి. నారాకోడూరు, చేబ్రోలు, వడ్లమూడి తదితర గ్రామాల్లో మోటార్లను కూడా దొంగలు మాయం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు పోలీసులకు అందాయి.

బాపట్ల అభివృద్ధికి కోన కృషి ఎనలేనిది



శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

బాపట్ల: బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి పుట్టినరోజు సందర్భంగా బాపట్లలోని శ్రీభావన్నారాయణస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోకి రాఘవరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బాపట్ల నియోజకవర్గంలో నిధులు వెల్లువగా ప్రవహించాయని గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కృషి చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో పదవులు చేపట్టాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత యఱ్రయ్య, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, నాయకులు జోగి రాజా, ఇనగలూరి మాల్యాద్రి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, షేక్.సయ్యద్ పీర్, చెన్నకేశవులు, బుల్లిరెడ్డి, మోర్ల సముద్రాల గౌడ్ ఉన్నారు.

శ్రావణ మాస ప్రత్యేక కార్యక్రమాలు



మాట్లాడుతున్న సత్యన్నారాయణ

చెరుకుపల్లి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రావణ మాస కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని కనగాల పృథ్వీశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో శనివారం ఎస్ఎస్ఎఫ్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ శ్రావణ పౌర్ణమి సందర్భంగా రక్షా బంధనం కార్యక్రమం ఈ నెల 19 నుంచి 22వ తేదీ న్విహించాలని సూచించారు. ఈ నెల 5న తులసీదాస్ జయంతి, 10న బాల వికాస్ శిక్షణ తరగతులు, 15, 29 తేదీల్లో ఏకాదశి సందర్భంగా భజన భక్త సమాజాలతో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా ధర్మ ప్రచారఖ్ జంజనం హేమశంకరరావు, ఫౌండేషన్ సభ్యులు ప్రసాద రావు, నాగేశ్వరరావు, అర్చకుడు జనతారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: రైతులందరూ తప్పని సరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ సూచించారు. మండలంలోని ఆరుంబాక పంచాయతీ పరిధిలో శనివారం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఏవో కౌలు రైతులు కూడా తప్పని సరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వం అందించే రాయితీలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల వేసిన పంట దెబ్బ తింటే ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం అందుతుదన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జెరాక్స్‌లు వ్యవసాయశాఖ అధికారులకు అదించాలన్నారు. కౌలు రైతులైతే కౌలు గుర్తింపు కార్డు ద్వారా ఈ-పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కర్లపాలెంలో నిరసన



కర్లపాలెంలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

కర్లపాలెం: దేశ సర్వోన్నత న్యాయ స్థానం ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ.. ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని కర్లపాలెం అంబేడ్కర్ సేవా సమాఖ్య గౌరవాధ్యక్షుడు మందపాటి పరమానంద కుమార్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ శనివారం మాలకుల నాయకులు కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం నల్ల రిబ్బన్లు ధరించి, నిరసన ప్రదర్శన చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.మీరయ్య, మాజీ సర్పంచ్ జోగి సజ్జన రావు, నాయకులు ఎరికల ఇర్మియా, మల్లెల సంతోష్, బి.జీవన జ్యోతి, కాగిత మహేష్, యోనా, సలగల ధర్మేంద్ర, ఎం.బాబూరావు, జార్జ్, మాణిక్యరావు, జోగి దాసు ఉన్నారు.

భారీగా బంగారం అపహరణ

- చెంచుపేటలోని అపార్ట్‌మెంట్‌లో చోరీ
- వివరాలు వెల్లడించని పోలీసులు



తెరచి ఉన్న బీరువా తలుపులు

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేట ఈద్గా సమీపంలో గల మార్గ్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చిన చోరీ ఘటనలో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న బి-10 ఫ్లాట్‌లోకి చొరబడిన దుండగులు నగదు, బంగారు ఆభరణాలు, వెండి అపహరించుకు వెళ్లారు. ఈ ఫ్లాట్‌లో ఏవీవీఎస్ సుజాత అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త నరసింహారావు మృతి చెందగా కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. ఐదు నెలల కిందట కుమారుని వద్దకు అమెరికా వెళ్లిన సుజాత గత ఆదివారమే తెనాలి వచ్చింది. బుధవారం రాత్రి తిరుమల వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దుండగులు ఇనుప రాడ్డు సాయంతో తలుపు తాళాలు, డోర్ మెష్ తొలగించి లోనికి చొరబడినట్లు తెలుస్తోంది. ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురు చేయడంతో పాటు స్క్రూడ్రైవ్‌తో కబోర్డులు, బీరువా తలుపులు తెరిచి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. కొన్ని వెండి వస్తువులు మాత్రం అక్కడే వదిలేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం వేరే పని నిమిత్తం ఫ్లాట్ వద్దకు వచ్చిన బంధువు వరుసైన మహిళ తలుపులు పగులకొట్టి ఉండటం చూసి చోరీ జరిగినట్లు నిర్ధారించారు. స్థానికులతోపాటు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఫ్లాట్‌లో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసింది. ఫ్లాట్ యజమాని సుజాత అందుబాటులో లేకపోవడంతో ఎంత మొత్తంలో సొమ్ము, ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నది తెలియరాలేదు. తిరుమల నుంచి సుజాత శనివారం తెల్లవారుజామున తెనాలి చేరుకున్నారు. త్రీ టౌన్ పోలీసులతో మాట్లాడి చోరీకి గురైన సొత్తు వివరాలు వెల్లడించారు. ఎంత సొత్తు చోరీకి గురైందన్న వివరాలు పోలీసులు వెల్లడించడం లేదు. 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేలకుపైగా నగదు, కొన్ని వెండి దిమ్మెలు అపహరించుకెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. చోరీ సొత్తు విలువ సుమారు రూ.18 లక్షల వరకు ఉండవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే అపార్ట్‌మెంట్‌లో 90కి పైగా ఫ్లాట్లు, వాచ్‌మెన్లు, నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ దొంగలు ఏ విధంగా లోనికి చొరబడి చోరీకి పాల్పడి ఉంటారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఇది బయటి వ్యక్తుల పనా లేక తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.